## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**78932 44734**

నంబర్‌ను సంప్రదించండి


## క్లుప్తంగా

### అభివృద్ధి పనుల పరిశీలన

**గోపాలపట్నం:** జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్, విమాన్‌నగర్‌లలో అభివృద్ధి పనులను కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ సగంలో నిలిచిన బీటీ రోడ్డు పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులను చేపట్టామని, వర్షాల వల్ల నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించారని తెలిపారు. గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

### అంధకారంలో మల్కాపురం


చీకటిగా ఉన్న మల్కాపురం సర్వీస్‌రోడ్డు

**మల్కాపురం:** జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక వీధిలో విద్యుత్ లైట్లు రాత్రి సమయాల్లో వెలగటం లేదు. దీంతో ఆ మార్గంలో సాయంత్రం సమయాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, వీధిలైట్లు పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు

**కంచరపాలెం:** సమాజంలో సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నందున యువత జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు 9440796019 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఇన్‌చార్జి డాక్టర్ సుజాత, కృష్ణకుమారి, పి.కె.జయలక్ష్మి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రాధాకృష్ణ మహోత్సవాలను జయప్రదం చేయాలి


సమావేశంలో పాల్గొన్న యాదవ మహిళా సంఘం ప్రతినిధులు

**మల్కాపురం:** ఆర్‌కే బీచ్ వద్ద వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాలను యాదవులంతా జయప్రదం చేయాలని జిల్లా యాదవ మహిళా విభాగ ప్రతినిధులు కోరారు. దీనిపై మల్కాపురం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అనేక సాంస్కృతిక పద్రర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పారిశ్రామిక ప్రాంతంలోని యాదవులంతా తరలిరావాలని కోరారు.

### అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.1.11 లక్షల విరాళం


దాత రామారెడ్డికి బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్‌ఏడీ కొత్తరోడ్డు సమీపం, పాత కరాసకు చెందిన బోర తారకరామారెడ్డి లక్ష 11వేల 111 రూపాయల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ పి.నరసింగరావు బాండ్ ఇచ్చారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.


కమ్యూనిటీ హాలుకు నోటీసులు అతికించి, తాళం వేసిన దృశ్యం


తాళాలు వేసిన కార్యాలయాలు

# ఏదీ నాటి వైభవం?

- అధ్వానంగా మద్రిపాలెం వుడా లేఅవుట్
- అవార్డులు అందుకున్న ప్రాంతంలో నేడు అపారిశుధ్యం
- కళావిహీనంగా పార్కు
- అసోసియేషన్ల మధ్య విభేదాలే కారణమంటున్న స్థానికులు
- కమ్యూనిటీ హాల్ కార్యాలయానికి తాళాలు


నిర్వహణ లేక పాడైన పార్కు


మద్రిపాలెం వుడా లేఅవుట్‌లో చెట్ల కొమ్మలు, వ్యర్థాలు

**గోపాలపట్నం:** జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడా లే అవుట్ అధ్వానంగా తయారైంది. అవార్డులు అందుకున్న కాలనీలో ఇప్పుడు చెత్తా చెదారం, వ్యర్థాలు, అపారిశుధ్యం తాండవిస్తున్నాయి. ఆనాటి వైభవం నేడేది అంటూ కాలనీవాసులే వాపోతున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి అసోసియేషన్ల మధ్య విభేదాల వల్లే కాలనీ ప్రతిష్ట మంటగలుస్తోందని వాపోతున్నారు.

**పురస్కారాలెన్నో..**

1992లో మద్రిపాలెం వుడా లేఅవుట్‌గా రూపొందింది. ఇళ్ల నిర్మాణం జరిగిన తరువాత 1995లో అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి కాలనీ అభివృద్ధికి అసోసియేషన్లు కృషి చేస్తూ వచ్చాయి. ఈ కాలనీ ఇప్పటివరకు ఆరుసార్లు బెస్ట్ కాలనీ అవార్డులు అందుకుంది. పార్కు నిర్వహణకు కూడా అవార్డులు పొందింది. 2020 నుంచి 2025 మధ్య అవార్డులు అందుకోవడమే కాకుండా అభివృద్ధి నిధులు కూడా అవార్డు రూపంలో మంజూరయ్యాయి. ప్రైవేటు సంస్థ అయిన ఏపీ సెర్వా (ఆంధ్ర ప్రదేశ్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్) బెస్ట్ అసోసియేషన్‌గా అవార్డు అందుకుంది.

**అధ్వానంగా వీధులు**

నాటి వైభవం అంతా ఇప్పుడు కనుమరుగవుతోంది. వీధుల్లో అపారిశుధ్యం తాండవిస్తోంది. చెట్ల కొమ్మలు, వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. వీధుల్లో పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు కూడా ఇక్కడి పరిస్థితి గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవార్డులు అందుకోవడం కాదు, కనీసం వీధులు శుభ్రం చేసే పనైనా చేయండంటూ వాపోతున్నారు. కాలనీ కమ్యూనిటీ హాల్‌కు అధికారులు తాళాలు వేసేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**అధికారుల తీరుపై అభ్యంతరాలు**

వుడా అధికారుల తీరుపై స్థానికులు అసోసియేషన్ సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కార్యాలయాలకు, కమ్యూనిటీ హాలుకు తాళాలు వేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పాత అసోసియేషన్ సభ్యులు కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది. వుడా అధికారులు ఈ విధంగా తాళాలు వేయడంపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గతంలో కమ్యూనిటీ హాలు నిర్వహణకు అనుమతులిచ్చినా, వాటిని పట్టించుకోకుండా ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో తాళాలు వేశారంటూ ఆరోపిస్తున్నారు.


ఏ వీధి చూసినా ఇదే పరిస్థితి..

**దిగజారిన కాలనీ ప్రతిష్ట**

కాలనీ ప్రతిష్ట దిగజారుతోందని.. భేషజాలు వీడి అభివృద్ధికి కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధి చేసిన కాలనీ ఇప్పుడు నిర్లక్ష్యానికి గురవుతోందని వాపోతున్నారు. కాలనీ అసోసియేషన్ ఫౌండర్లు చొరవ చూపి, ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఒక అసోసియేషన్ ఉండగా మరో అసోసియేషన్ ఏర్పాటు చేయడం ప్రతిష్టను దిగజార్చడమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా సమస్యను పరిష్కరించుకుంటే మంచిదనే అభిప్రాయాన్ని కాలనీ వాసులు వ్యక్తం చేస్తున్నారు.

## బాలికల సంరక్షణపై విద్యార్థులకు పోటీలు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**గోపాలపట్నం:** గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సేవ్ గర్ల్ చైల్డ్ అంశంపై శనివారం మండలస్థాయి పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, పెయింటింగ్, వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వ్యాస రచన పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు ఎం.లహరి (గోపాలపట్నం హైస్కూల్), **జి.సీతామహాలక్ష్మి** (హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్), **వై.రక్షితారాణి** (యల్లపువానిపాలెం హైస్కూల్) **మొదటి** మూడు స్థానాల్లో నిలిచారు. **చిత్రలేఖనంలో** మాధవధార జీవీఎంసీ హైస్కూల్ **8వ తరగతి విద్యార్థి** సీహెచ్ ప్రణీత, కప్పరాడ **హైస్కూల్ 9వ త**రగతి విద్యార్థి ఎస్.భానుసాయి, **గోపాలపట్నం బా**లుర హైస్కూల్ విద్యార్థి ఎం.**లావణ్య ప్రతిభ** కనబరిచి, విజేతలుగా నిలిచారు. **వక్తృత్వ పోటీల్లో** జీవీఎంసీ కప్పరాడ 10వ తరగతి విద్యార్థి బి.నాగసత్యదుర్గ, గోపాలపట్నం బాలికల హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి జి ప్రసన్న, యల్లపువానిపాలెం హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి కె.యామిని గెలుపొందారు. వీరిని డీఈవో దివాకర్, హెచ్ఎం వేణుగోపాల్ అభినందించారు.

## డాక్‌యార్డ్ వంతెన అందుబాటులోకి తేవాలని వినతి

**మల్కాపురం:** డాక్‌యార్డ్ వద్ద గల సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన పనులను వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. ఈ వంతెనను వాహనదారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ కలెక్టర్‌కు, పోర్ట్ అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మరమ్మతుల కారణంగా 14 నెలలుగా బ్రిడ్జిపై వాహనాల రాకపోలకు ఆపేశారని తెలిపారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వారు నగరానికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి మరమ్మతులు వేగవంతం చేసి, అందుబాటులోకి తేవాలని కోరారు. దీనిపై కలెక్టర్, పోర్ట్ అధికారులు సానుకూలంగా స్పందించారని జగ్గునాయుడు వివరించారు.

## ఉత్సాహంగా మ్యాథ్‌మ్యాట్రిక్స్-2025


అతిథులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

**కంచరపాలెం:** విద్యార్థుల్లో మేధా కౌశలాన్ని, అంతర్గత ప్రతిభా పాటవాలని ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల గణిత పోటీలు ఎంతో దోహదపడతాయని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. శుక్రవారం గణిత విభాగం, గణాంక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో మ్యాథ్ మ్యాట్రిక్స్-2025 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమగ్ర విద్య లెక్చరర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, ద్వితీయ భాషల పూర్వాధిపతి డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, ఏయూ గణిత ఆచార్య శర్మ మాట్లాడారు. నగరంలో పలు కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు క్విజ్, సుడోకో, మైండ్ మేస్, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కెప్టెన్ కె.సుజాత, కె.కె. సౌజన్య, జి.యోజన, లక్ష్మి, ఎస్.శ్రీరామ్, గౌరీశంకరరావు, సునీత చౌదరి, వి.భారతి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## దృష్టి లోపం గల విద్యార్థులకు ఆధార్ సేవలు

**మహారాణిపేట:** ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల ఫర్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ (గర్ల్స్) ఎండాడ విద్యార్థుల కోసం రెండు రోజుల పాటు ఆధార్ నమోదు, నవీకరణ కార్యక్రమం నిర్వహించామని తపాలా శాఖ సీనియర్ సూపరింటెండెంట్ తెలిపారు. దృష్టి లోపం గల బాలికల పాఠశాలలో ఆధార్ బృందం మొత్తం 24 మందికి ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేట్ నిర్వహించారన్నారు. అన్ని వర్గాల వారికి ఆధార్ సేవలను విస్తరించాలని పోస్టల్ శాఖ నిరంతరం ప్రయత్నాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామని పోస్టల్ అధికారులు తెలిపారు.

## వెంకటేష్ రెడ్డికి ‘మళ్ల ’ అభినందన


వెంకటేష్‌ను అభినందిస్తున్న మళ్ల విజయప్రసాద్, పిలక రాము

**మల్కాపురం:** వైఎస్సార్‌టీయూసీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త పిలక వెంకటేష్‌రెడ్డిని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్, పార్టీ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి వెంకటేష్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువతకు పరిశ్రమల్లో ఉపాధికల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు.

## బాధితులకు భరోసా ఏది?

**62వ వార్డులో రోడ్డు విస్తరణపై స్థానికుల ఆందోళన**


62వ వార్డులో రోడ్డుపై ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, నాయకులు

**సింధియా:** ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఏర్పరచుకుని, జీవనం సాగిస్తున్న నిరుపేదల గృహాలను, వారికి ఎలాంటిభరోసా కల్పించకుండా తొలగించేందుకు ప్రయత్నించడం సరికాదని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పేర్కొన్నారు. వార్డు పరిధి అచ్చెంనాయుడు లోవలో టిడ్కో గృహాలు ప్రారంభం కానున్నాయన్న నెపంతో వార్డులోని గుడివాడ అప్పన్నకాలనీ నుంచి అల్లూరి సీతారామరాజు కాలనీ మీదుగా అచ్చెంనాయుడులోవకు సుమారు 40 అడుగుల రహదారి నిర్మించేందుకు జీవీఎంసీ అధికారులు గురువారం ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన స్థానికులు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు వద్దకు వెళ్లి, తమ బాధను వ్యక్తం చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన లక్ష్మణరావు, సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా వారి నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్పందించి, బాధితులకు తగిన భరోసా కల్పించి, లిఖిత పూర్వక హామీ ఇవ్వాలని కోరారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే, అధికారుల తీరును కౌన్సిల్ దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. బాధితులకు తగిన న్యాయం చేయకుండా రహదారి విస్తరణ చేసే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దృఢ సంకల్పంతోనే మెరుగైన ఫలితాలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు

**మద్దిలపాలెం:** విద్యలో రాణించేందుకు ,దృఢ సంకల్పంతో విద్యార్థులు ముందుకు సాగాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. ఏయూలో శుక్రవారం ప్రపంచ సాంఖ్యాకశాస్త్ర దినోత్సవాన్ని ఆంధ్రా యూనివర్సిటీ సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి, జనాభా పరిశోధన కేంద్రం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్. బి. మునిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభ్యాసంలో మెలకువలు, విద్య, ఉద్యోగ సాధనలో ఏం చేయాలో వివరించారు. అలాగే స్టాటిస్టిక్స్ ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు. ప్రొఫెసర్ బి. మునిస్వామి మాట్లాడుతూ సాంఖ్యాక శాస్త్ర ఆవశ్యకత, వివిధ అంశాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఆయా అంశాలు దేశాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తాయన్నారు. ఈ స్టాటిస్టిక్స్ ఏ విధమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందో వివరించారు. వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు కె. శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

## రైల్వే హాస్పిటల్‌లో డయాలసిస్ యూనిట్ ప్రారంభం


నూతన డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, జ్యోత్స్న బోహ్రా

**తాటిచెట్లపాలెం:** దొండపర్తిలోని వాల్తేర్ డివిజన్ రైల్వే హాస్పిటల్‌లో నూతన డయాలసిస్ యూనిట్‌ను శుక్రవారం డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ యూనిట్‌ను ఎస్‌ఏపీ మెడికల్స్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా రైల్వే ఉద్యోగులు, వారి భాగస్వాములు, కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, రైల్వే హాస్పిటల్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహోద్యమంలా కోటి సంతకాల సేకరణ

**మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత**


40వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

**సింధియా:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ మహోద్యమంలా కొనసాగుతోంది. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆదేశాల మేరకు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఇంటింటా తిరుగుతూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కళాశాలల ప్రైవేటీకరణ వలన వచ్చే నష్టాలను ప్రజలకు వివరిస్తూ, సంతకాలను సేకరిస్తున్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**62వ వార్డులో..**

జీవీఎంసీ 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద కోటి సంతకాల సేకరణను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులు వైద్యవిద్యకు దూరమవుతారని తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, చింతా ప్రభాకర్, మసేనమ్మ, భారతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.


62వ వార్డులో కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

**91వ వార్డులో..**

**గోపాలపట్నం:** ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని 91వ వార్డులో ప్రారంభించారు. బుచ్చిరాజుపాలెంలో వార్డు ఇన్‌చార్జి ఆళ్ల పైడిరాజు ఆధ్వర్యంలో వార్డు నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు నష్టం కలిగించే ప్రైవేటీకరణపై ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు చుక్క పైడిరాజురెడ్డి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు పెద్దాడ ఈశ్వరరావు, వార్డు మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషారాణి, మహిళా కార్యదర్శి వస శ్యామల, వార్డు నాయకులు చుక్క అప్పలస్వామి, పూరెడ్డి పైడిరెడ్డి, తంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


91వ వార్డులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వార్డు ఇన్‌చార్జి ఆళ్ల పైడిరాజు తదితరులు

**56వ వార్డులో..**

**కంచరపాలెం:** వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కరపత్రాన్ని 56వ వార్డు పరిధి గవర కంచరపాలెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుడితే, కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తోందన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే ఈ చర్యను అందరం ఖండించాలన్నారు. కార్యకర్తలు ప్రజలకు ఈ విషయాలను వివరించి, సంతకాలు సేకరించాలని సూచించారు. అనంతరం కార్యకర్తలకు కరపత్రాలు అందజేశారు.


56వ వార్డులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆడారి శ్రీనివాసరావు, నాయకులు

## అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

**సింహాచలం:** ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. డిప్యూటీ ఈవో రాధ, సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**వైభవంగా నిత్యకల్యాణం**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

## విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి


సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

**దాబాగార్డెన్స్:** విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్‌రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేసినా.. సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగారు. ఈమేరకు శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం (సర్కిల్ ఆఫీస్) వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకుడు శ్రీనివాస్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.


సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com